నేడు భక్తాంజనేయ స్వామి ఆలయంలో కుంభాభిషేకం

నిజాంపేట్: బాచుపల్లిలోని శ్రీ భక్తాంజనేయ స్వామి, శ్రీ సప్తమాతృక రాధమ్మదేవి ఆలయాల్లో ఈ నెల 26న పుష్కర కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో నవగ్రహాది దేవతాలకు కుంబాభిషేకం, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నారు. 27న సప్తమాతృక రాధమ్మదేవి ఆలయంలో శతచండీ యాగ పూర్ణాక పుష్కర కుంబాభిషేకం, అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

27న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



శ్రీకాశీ విశ్వేశ్వర స్వామి మూల విరాట్

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ ఎం.ఎస్.రెడ్డి.నగర్‌లోని శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సందిరి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా 27న గణపతి పూజ, పుణ్యాహ వాచనము, ఋత్విగ్వరణము, కలశస్థాపన, అవాహిత దేవతారాధన, 28న ఉదయం గణపతి, నవ గ్రహ, సుబ్రహ్మణ్య, మన్యుసరాక్త, మృత్యుంజయ సహిత రుద్రహోమం, చండీ హోమం, పూర్ణాహుతి, శివ కల్యాణం, ఋత్విక్ సన్మానం, మధ్యాహ్నం 1 గంటకు అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం



బూత్ కమిటీ అధ్యక్షులతో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్

దుండిగల్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని పార్టీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వర్ అన్నారు. బుధవారం దుండిగల్‌లో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులను ఎంపిక చేశారు. 5 వ బూత్ అధ్యక్షుడిగా చలకల కిరణ్, 6వ బూత్ అధ్యక్షుడిగా నాగేంద్రబాబు, 7వ బూత్ అధ్యక్షుడిగా శ్రీధర్‌గౌడ్, 8వ బూత్ అధ్యక్షుడిగా ఆకుల శివ, 9వ బూత్ అధ్యక్షుడిగా కుమ్మరి రమేష్‌లను నియమించారు. స్థానికంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహగౌడ్, ఆకుల మల్లేష్, ఆకుల విజయసాయి, భాను, యశ్వంత్ పటేల్, తలారి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం..



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఒద్దులావాగుపల్లి వాసులు..

రంగారెడ్డినగర్: ఒద్దులావాగుపల్లి వాసుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఉత్సాహంగా కొనసాగింది.. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ వైఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో హైదరాబాద్ నగరంలో స్థిరపడిన ప్రకాశం జిల్లా, రాచర్ల మండలం, ఒద్దులావాగుపల్లి వాసుల గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆడుతూ, పాడుతూ సందడి చేశారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 25న ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు మధురై వెంకట రంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మారుడు వెంకటరంగారెడ్డి, అన్నపురెడ్డి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏవీ శివారెడ్డి, కోశాధికారి మదిరి అల్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం బోడుప్పల్ కమిషనర్ రామలింగం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా సర్వే నిర్వహించాలన్నారు. సర్వే పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి, కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బాచుపల్లిలో..



ప్రగతినగర్ ఇన్‌కాయిస్ సెంటర్‌లో..



సుభాష్‌నగర్ డివిజన్‌లో..

మహనీయుడా..నిను మరువం..

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి వేడుకలు

కుత్బుల్లాపూర్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి వేడుకలు బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నిజాంపేట్ కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీలు, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో వాజపేయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో పండ్లు పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను నిర్వహించారు. వాజ్‌పేయి హయాంలో పోఖ్రాన్-2 అణు పరీక్షలు నిర్వహించి దేశ అణుశక్తి సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటారని, స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహించి దేశాభివృద్ధికి బాటలు వేశారని కొనియాడారు.



కార్తికేయ ఓల్డేజ్ హోమ్‌లో..



కొంపల్లిలో...



పల్లవి అనాథాశ్రమంలో..



కొంపల్లి 1వ వార్డులో..

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 18వ డివిజన్ పరిధిలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతనిస్తున్నట్లు వివరించారు. కార్పొరేటర్ పులకండ్ల హేమలతాజంగారెడ్డి, కాలనీవాసులు యాదయ్య, ప్రభు, ప్రభాకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

కుషాయిగూడ: ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సదరు మహిళ గతవారం రోజులుగా కుషాయిగూడ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉంటుందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె పేరు శాంతమ్మగా తనకు మతిస్థిమితం లేదని గుర్తించారు. అనారోగ్యంగా ఉన్న ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించి, అనంతరం చక్రీపురంలోని ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించారు. తిరిగి అనారోగ్యానికి గురై మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోండి

చింతల్: ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, అధికారులు వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. చింతల్ డివిజన్ స్టార్‌లైట్ అపార్ట్‌మెంట్ సమీపంలోని సర్వే నెంబరు 148లోని ప్రభుత్వ భూమిని కొందరు ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని బుధవారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పత్తి సతీష్ ఆధ్వర్యంలో ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ భూమిని 29 ప్లాట్లుగా చేసిన కబ్జాదారులు వాటికి పట్టాలు ఇప్పిస్తామని చెబుతున్నారన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డితో మాట్లాడి ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సదానంద, నల్ల జైశంకర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, రామ్‌సాయియాదవ్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఈటలకు ఫిర్యాదు చేస్తున్న పత్తి సతీష్ తదితరులు

మున్నూరు కాపు సంఘం కేలండర్ ఆవిష్కరణ

సుభాష్‌నగర్: మున్నూరు కాపు కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు తనవంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం దూలపల్లిలో మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారిని సంఘం ఆధ్వర్యంలో ఆదుకోవాలని, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, కౌన్సిలర్లు ఎల్లుగారి సత్యనారాయణ, నర్సింగం భరత్, నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శులు బర్మ ప్రవీణ్‌కుమార్, రాజేందర్, ఉపాధ్యక్షులు కొత్తకొండ శ్రీనివాస్, అప్పాల లింగమూర్తి, బర్మ చక్రపాణి, కుంట సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తదితరులు

సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి



ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్ వ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం చైర్మన్ నాగేష్ ముదిరాజు ఆలయ ఆవరణ, ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో ప్రధాన కూడళ్లు, ఆలయాలు తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మక్కాల నర్సింగ్‌రావు, మక్కాల సత్యనారాయణ, బాల్‌రాజు, నాయకులు నరేందర్‌గౌడ్, కర్రె జంగయ్య, హరినాథ్, మట్టి శ్రీను, చందుయాదవ్, సాదిక్, శేఖర్‌గౌడ్, బాబా, మేరాజ్, సిరాజ్, ఉమాదేవి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న రంగానగర్ కాలనీ నేతలు

కుత్బుల్లాపూర్: సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం చింతల్ డివిజన్ రంగానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు అధ్యక్షుడు బండారు వరప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించి కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ రంగానగర్‌లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు రామ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌రావు, ట్రెజరర్ సరోజ, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, గుమ్మడి రామకృష్ణ, మహేష్, పద్మజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొమ్మ తుపాకీతో విద్యార్థుల హల్ చల్

ఆలస్యంగా వెలుగులోకి..

నిజాంపేట్: బొమ్మ తుపాకీతో విద్యార్థులు హల్ చల్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాచుపల్లి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 13న రాత్రి ఇంజినీరింగ్ విద్యార్థులు విశాల్ రెడ్డి,చరణ్, కౌశిక్ వర్మ,కేతిరెడ్డి కౌశిక్ రెడ్డి నిజాంపేట్‌లోని కేటీఆర్ కాలనీలో బొమ్మ తుపాకీతో వాహనాలపై తిరుగుతూ తుపాకీతో కాలుస్తున్నట్లు నటిస్తూ హంగామా చేశారు. దీంతో భయాందోళనకు గురైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి బొమ్మ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బాచుపల్లి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. విద్యార్థులు ఉపయోగించిన తుపాకీ షూటింగ్‌ల్లో ఉపయోగించే తుపాకీగా గుర్తించారు.

నేడు నాగదేవతల, నందీశ్వరుని ప్రతిష్ఠ

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్ సమీపంలోని శాస్త్రినగర్‌లో శివ ఆంజనేయ స్వామి నాగదేవతల, నందీశ్వర పునః ప్రతిష్ఠ, నూతన దీపస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజ, మండపారాధన తదితర పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం 10.27 గంటలకు చింతపల్లి వంశీ మోహన్ రెడ్డి, డీఎస్‌పీ చింతపల్లి శోభ, గూడూరి కల్యాణ్ రెడ్డిలచే నాగదేవతల, నందీశ్వర పునః ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు..



సూరారంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.. ఉదయం నుంచి ఆయా ప్రాంతాల్లోని చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ప్రార్థనల్లో పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.



కొంపల్లిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



బేతనీయ ప్రార్థన మందిరంలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ సైమన్



సూరారం స్కందానగర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్..

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ

బోడుప్పల్: మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా బోడుప్పల్‌లో బుధవారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. జిల్లా కార్యదర్శి కూరపాటి విజయ్ కుమార్, తుప్పత్ ఆనంద్, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

బోడుప్పల్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని బుధవారం అంబేద్కర్ కాలనీ మహిళలు 40 మందికి 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు.

నిరీక్షణకు తెర

అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు

- సంక్రాంతి నుంచి కొత్త దరఖాస్తుల స్వీకరణ
- ప్రజాపాలన దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులు
- నగర శివారులో అందినవి 3.89 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: పేద ప్రజల ఆహార భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్‌కార్డుల ద్వారా రాయితీపై బియ్యం, ఇతర వస్తువులు అందిస్తున్నాయి. గత ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీపై దృష్టి సారించకపోవడంతో దరఖాస్తుదారులు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు.

ఆరేళ్లుగా కార్డుల జారీ నిలిపివేత..

నగర శివార్లలో ఆరేళ్లుగా పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేశారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు వేలల్లో ఉన్నారు. కార్డుల్లో మార్పు చేర్పులకు దరఖాస్తు చేసుకున్న వారు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. 2018లో కేవలం ఒకసారి మాత్రమే కొన్ని కార్డులను జారీచేసి పలు కారణాలతో నిలిపివేశారు. పదేళ్లుగా కొత్తగా పెళ్లిళ్లు చేసుకున్న వారు, కార్డుల్లో పిల్లల పేర్లు నమోదు చేయాల్సిన వారంతా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారు.

లబ్ధిదారుల్లో అయోమయం..

రేషన్ కార్డుల జారీ కాకపోవడంతో రేషన్‌కార్డుతో పాటు వచ్చే ఆరోగ్యశ్రీ సేవలను పొందలేకపోతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులను ముడిపెట్టడంతో కార్డులు లేని వారిలో అయోమయం నెలకొంది. ఇళ్ల మంజూరు, పెన్షన్లు, ఇతర ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డులను ప్రామాణికంగా తీసుకోవడంతో కార్డులు లేని వారు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ ప్రకటనతో హర్షం..

కొత్తగా వివాహాలు చేసుకున్న వారికి అర్హత ఉన్నా.. రేషన్‌కార్డులు లేకపోవడంతో ఆహార భద్రతా పథకంతో పాటు పలు పథకాలకు దూరమవుతున్నారు. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో దరఖాస్తుదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

◆ మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రస్తుతం 10,82,348 రేషన్ కార్డులు ఉండగా, 35,40,883 మంది లబ్ధిదారులుగా ఉన్నారు. ఇందులో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 5,32,938 రేషన్‌కార్డులు ఉండగా.. 17,18,351 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఏళ్లుగా రేషన్ కార్డులు అందకపోవడంతో కొంతమంది అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రజాపాలనలో..

ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. నగర శివారు 3.89 లక్షల దరఖాస్తులు పౌరసరఫరాలశాఖ అధికారులకు చేరాయి. తాజాగా సంక్రాంతి నుంచి కొత్త కార్డులను జారీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మరోసారి స్వీకరించే అవకాశాలున్నాయి. ఈ ప్రక్రియ కోసం అవసరమైన మార్గదర్శకాలు జనవరి మొదటి వారానికి కొలిక్కి రానున్నాయి.

ఆదేశాలు రాగానే....

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొత్తరేషన్ కార్డుల జారీకి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు ప్రకటించాయి. ప్రభుత్వ నిర్ణయం మేరకు ముందుకు సాగుతామని అధికారులు చెబుతున్నారు.

రేషన్ కార్డులే ప్రామాణికం..

ఉచిత బియ్యంతో పాటు ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసి, ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి నుంచి కొత్త రేషన్‌కార్డులను జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వాటి కోసం.. దరఖాస్తు చేసుకున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.